క్లుప్తంగా

ఖైదీలతో బాధ్యతగా వ్యవహరించాలి


జైలులోని ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: ఖైదీలతో జైలు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. జైలు అధికారులు జైలులో వారికి కల్పిస్తున్న వసతులు అడిగి తెలుసుకున్నారు. శుభ్రత పరిశుభ్రత విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలుసుకున్నారు. ఖైదీలకు పెట్టే భోజనం మెనూ గురించి రికార్డులు పరిశీలించారు. ఖైదీలు వారి సమస్యలను తెలియజేసుకునేందుకు న్యాయాధికారులు తనిఖీలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో జైలుశాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పెన్షన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం పట్టణంలోని పోలీసుస్టేషన్ వీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో 31వ తేదీనే ఇంటి వద్దనే పెన్షన్ నగదు లబ్ధిదారులకు అందిజేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ డి.వెంకటదాసు పాల్గొన్నారు.

90 శాతం పెన్షన్ల పంపిణీ

మార్కాపురం రూరల్: మండలంలో 90 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తోట చందన తెలిపారు. వర్షం కురుస్తున్నప్పటికీ సిబ్బంది గ్రామాల్లో పెన్షన్లు అందించినట్లు తెలిపారు. మొత్తం 7,065 మందికి గానూ సాయంత్రం 4 గంటల వరకు 6,361 మందికి అందజేసినట్లు చెప్పారు.

జార్జి కళాశాల విద్యార్థుల ప్రతిభ




సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య

మార్కాపురం: స్థానిక శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీ- బి పరీక్షల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కెప్టెన్ అనిల్ ఆధ్వర్యంలో మొత్తం 16 మందికి బి- సర్టిఫికెట్ అందించారు. 10 మంది ఏ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. జేసీఓ ఇంద్రజిత్ సింగ్, సుధీర్, టెక్నికల్ అడ్వయిజర్ మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కార్యదర్శి ఆదిమూలపు విశాల్ పాల్గొన్నారు.

పంటల పెంపకంలో జాగ్రత్త

మార్కాపురం: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బొప్పాయి, కూరగాయలు సాగుచేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారి దాసు రమేష్ శనివారం తెలిపారు. కొత్తగా బొప్పాయి మొక్కలు నాటిన రైతులు పొలంలో నీరునిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అధిక వర్షాల వలన మొక్కలు పసుపురంగులోనికి మారడం, కండం కుళ్లు తెగుళ్ల వంటి లక్షణాలు ఉంటే లీటర్‌నీటికి రెండు గ్రాముల రెడోమిల్, ఎలైట్‌రెండు గ్రాములు కలిపి మొక్కల మొదట్లో పోయాలని తెలిపారు. కూరగాయల సాగులో పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలని వివరించారు. మొలకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోడానికి లీటర్ నీటికి పది గ్రాముల యూరియా, పది గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ


తర్లుపాడులో విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ

తర్లుపాడు: తర్లుపాడు పంచాయితీలో నిధుల దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఫిర్యాదులపై డీఎల్‌పీఓ వై. భాగ్యవతి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీలో చేపట్టిన పనుల వివరాలను కార్యదర్శి అచ్యుతరావును అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. సర్పంచ్ వరాలు, ఈఓఆర్‌డీ బాలకృష్ణ పాల్గొన్నారు.

వానా వందనం!


గొట్లగట్టులో జల్లులతో కూడిన వర్షం


పంచాయతీ కార్యాలయం వద్ద కుంటను తలపిస్తున్న రోడ్డు

కొనకనమిట్ల: అల్పపీడన ప్రభావంతో మండలంలో శనివారం ముసురుతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో కూడిన వర్షానికి పదును వర్షం పడటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన సజ్జ, కంది, పత్తి పంటలకు వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల నాట్లు వేసిన మిరప, పొగాకు పంటలకు వర్షం అనుకూలంగా ఉంటుంది. గొట్లగట్టు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద, ప్రధాన రహదారిపై నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇంకో 15 రోజుల్లో వచ్చే ఉత్తర కార్తెలో అలసంద, మినుము పంటలు సాగు చేయటానికి పొలాలు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తామని రైతులు తెలిపారు.

సగిలేరు వాగును పరిశీలించిన కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో సగిలేరు వాగును స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు శనివారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. ప్రధానంగా సగిలేరు వాగు ఉధృతితో శ్రీనివాస థియేటర్, పాతాళనాగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉందని కమిషనర్ తన సిబ్బందితో సగిలేరు వాగును పరిశీలించారు. వాగు ఉధృతితో నీట మునగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు ధైర్యం చెప్పేందుకు ఆ ప్రాంతంలో పర్యటించారు. వాగులో కింది స్థాయిలో నీరు ప్రవహిస్తుండటంతో ముంపు ఉండకపోవచ్చని అధికారులు నిర్ధారించుకున్నారు. ఇదే తరహాలో మరో రెండు రోజుల పాటు వర్షం కురిస్తే వాగు ఉప్పొంగే ప్రమాదం ఉందని గ్రహించారు. అందుకు అనుగుణంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై కమిషనర్ అధికారులతో చర్చించారు.

అధిక వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: అధిక వర్షాల కారణంగా అరటి, బొప్పాయి, మిరప, కూరగాయల పంటల రైతులు జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఉద్యానవన శాఖ అధికారి విష్ణుప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వర్షపు నీరు తోటల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు అధికంగా ఉంటే మొక్కలు భూమి నుంచి పోషకాలు తీసుకోలేవని చెప్పారు. గాలికి చెట్టు నేలకొరగకుండా కర్రలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఎడతెరపి లేకుండా వర్షం

కొమరోలు: వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం రాత్రి నుంచి వర్షం పడుతుండటంతో చిరువ్యాపారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షానికి రైతులు తమ పంట పొలాలకు మేలు చేకూరుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న, మిర్చి పంటలకు మేలు చేకూరుతుందని తెలిపారు.


వాగును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటదాసు

కంట్రోల్ రూము ఏర్పాటు

పొదిలి: తుఫాన్ సమస్యల పరిష్కారం కోసం నగర పంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 7095151443, 8333831777 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

రాచర్ల: బంగాళఖాతంతో ఏర్పాడిన వాయుగుండం కాణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాచర్లలో అత్యవసర సహాయం, సమాచారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లుగా డిప్యూటీ తహసీల్దార్ భారతిభయ్ తెలిపారు. పాత మిద్దెలు, పాడుబడిన కట్టడాలు కింద నివసించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయరాదని తెలిపారు. 92810 34483 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

వైఎస్సార్ వర్ధంతికి సేవా కార్యక్రమాలు చేయాలి

బేస్తవారిపేట: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ నెల 2వ తేదీన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను, అభిమానులను కలుపుకుని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అదుపుతప్పి వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

కంభం: వేగంగా వెళ్తున్న మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన స్థానిక హైవే రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి గుంతకల్లుకు ఆవనూనె లోడుతో వెళ్తున్న వాహనం అనంతపురం-అమరావతి హైవే రోడ్డుపై కంభంలోని యూ టర్న్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

నారుమడుల్లో నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి

బేస్తవారిపేట: వర్షాలకు నారుమడుల్లో ఉన్న మిరప, కూరగాయల నారుకు కుళ్లు తెగులు సోకే అవకాశం ఉందని ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత అన్నారు. నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా కాల్వల ద్వారా బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మాంకోజెబ్ లేదా రిడోమిల్ వంటి శిలీంద్ర నాశకాలను నారుపై పిచికారీ చేసుకోవాలన్నారు. కొత్తగా నాటిన బొప్పాయి, అరటి, మిరప, కూరగాయల పంటలలో ముందుగా పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో వేరు కుళ్లు తెగులును నివారించవచ్చన్నారు. పొలాల్లో వర్షం నీరు ఎక్కువ నిల్వ ఉండటంతో పోషకాలు తీసుకోలేక పసుపు రంగుకు మారి చనిపోయే అవకాశముందన్నారు. సూక్ష్మపోషకాల మిశ్రమం ఫార్ములా-6 ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఏకీకృత పెన్షన్ విధానం వద్దు


నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి డిమాండ్ చేశారు. సామాజిక భద్రతలేని యూపీఎస్ పథకం ఉద్యోగులను, ఉపాధ్యాయులను దగా చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా పాత పెన్షన్ విధానాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. జీపీఎస్, యూపీఎస్‌ను అంగీకరించమని స్పష్టం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకూ 117 జీవో రద్దు చేయలేదన్నారు. జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులను ప్రభుత్వం గందరగోళానికి గురిచేస్తోందన్నారు. నాయకులు నాగేంద్రరెడ్డి, చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం


రోడ్డు మార్జిన్‌లో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు


అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని కొత్తూరు సమీపంలో ఆర్టీసీ బస్‌కు ప్రమాదం తప్పిన సంఘటన శనివారం జరిగింది. పాపినేనిపల్లె నుంచి కంభం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్ కొత్తూరు మూలమలుపులో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదానికి గురైంది. బస్ ఒకవైపు పూర్తిగా రోడ్డు మార్జిన్ దిగి కూరుకుపోయింది. డోర్ నుంచి ప్రయాణికులు వచ్చే అవకాశం లేకుండపోయింది. అత్యవసర డోర్ నుంచి ప్రయాణికులను బయటకు దింపారు. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పాడి రైతులకు బోనస్ అందజేత


రైతులకు బోనస్ అందజేస్తున్న దృశ్యం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామంలో కృష్ణ మిల్క్ యూనియన్, విజయ డెయిరీ ఆధ్వర్యంలో జిల్లా మేనేజర్ దిలీప్ కుమార్, చైర్మన్ చలసాని ఆంజనేయులు పర్యవేక్షణలో శనివారం పాడి రైతులకు బోనస్ నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జూలై నెల వరకు నాలుగు నెలలకు సంబంధించిన బోనస్ 50 వేల రూపాయలు అందించామన్నారు. జిల్లా మొత్తం మీద పాడి రైతులకు రై.1.70 కోట్ల మేర బోనస్ అందినట్లు వివరించారు. అంతే కాకుండా కృష్ణ మిల్క్ యూనియన్ తరఫున రైతులకు స్థిరమైన ధర, సబ్సిడీ ద్వారా కాల్షియం, మినరల్ మిక్సర్, పశువుల దాణా, గేదెలకు యద ఇంజక్షన్లు అందజేస్తామన్నారు. సూపర్‌వైజర్ మంత్రి శ్రీనివాసులు సంఘం అధ్యక్షుడు పోలసాని కృష్ణారెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

అక్టోబర్ నాటికి ట్రాఫిక్ సమస్య పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ ప్రధానంగా ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతోందని, అక్టోబర్ నాటికి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు, నగర పంచాయతీ అధికారులు, ఇతరు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాచర్ల రోడ్డులో గేటు సమస్య పరిష్కారం కోసం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగర పంచాయతీలో నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత నీటి సరఫరా కోసం కృషి చేస్తున్నామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆయన కోరారు. సగిలేరు వాగులో చెక్ డ్యామ్, సైడు వాల్ వంటి వాటిని నిర్మించి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ఆహ్లాదకర వాతావరణం పచ్చదనంతోనే సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు ఒక చెట్టు నాటాలని కోరారు. చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ డి.వెంకటదాసు, ఏఈ శంకర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి పాల్గొన్నారు.

గోవుకు.. వృషభానికి కల్యాణం

పొదిలి: అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోవుకు, వృషభానికి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలు పెరమాళ్ళ భాస్కర్‌రావు, సుజాత దంపతుల చేతుల మీదుగా జరిగింది. యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, మేడా నరసింహారావు శనగపల్లి నాగేశ్వరరావు, రవి స్వామి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు

మెరుగైన వైద్యసేవలు అందించాలి


మాట్లాడుతున్న బాబు

మార్కాపురం రూరల్: రాష్ట్రంలో జ్వరాలు ఎక్కువయ్యాయని, ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ ఈనెల 1నుంచి 15 వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీజే (మూవ్‌మెంటు ఫర్ పీస్ అండ్ జస్టిస్) వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సదుపాయాలు అందుతున్నాయా.. లేదా అని నివేదిక పంపుతామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 228 హాస్పిటల్స్ ఉన్నాయని, మొత్తం 15,208 బెడ్లు ఉన్నాయని వీటిలో 20 జిల్లా వైద్యశాలలు, 56 ఏరియా హాస్పిటల్స్, 117 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 10 స్పెషాలిటీ హాస్పిటల్స్, 25 సివిల్ డిస్పెన్సరీలు ఉన్నాయన్నారు. వైద్యశాలలో రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యశాలల్లో వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యశాలల్లో అత్యవసర మందులు కొనుగోలుకు నిధులు లేవన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మెడికల్ షాపుల్లో తనిఖీ చేసి కాలపరిమితి ముగించిన మందులను సీజ్ చేయాలన్నారు.

బూత్ లెవల్లో సభ్యత్వాలు చేయాలి

దర్శి: బూత్ లెవల్లో బీజేపీ సభ్యత్వాలు నమోదు చేసి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి కోరారు. మండలంలోని రాజంపల్లిలో దర్శి రూరల్ మండల అధ్యక్షుడు కాకర్ల సాయి అధ్యక్షతన బీజేపీ మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా తిండి నారాయణరెడ్డి మాట్లాడుతూ బూత్ లెవల్ నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి పంచాయతీలో సభ్యత్వ నమోదు చేయడం కోసం ప్రతి మండల స్థాయి నాయకుడు కృషి చేయాలన్నారు. బీజేపీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యం అవుతుందని, అలాంటి పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు.

సత్తా చాటిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు


ఎన్నికల్లో గెలుపొందిన విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పాపినేనిపల్లె జెడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు సత్తాచాటారు. ఈ నెల 8వ తేదీన కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. 17వ తేదీన జరిగిన ఎన్నికల్లో నాలుగు తరగతులకు ఎన్నికలు జరిపి పదో తరగతిలో కోరం లేదంటూ వాయిదా వేశారు. శనివారం జరిగిన పదో తరగతి ఎన్నికల్లో టీడీపీ పోటీ పెట్టలేదు. వైఎస్సార్ సీపీకి చెందిన దొంతా తిరుపతిని చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా వల్లపురెడ్డి కాశమ్మలను ఎన్నుకున్నారు. గతంలో పాపినేనిపల్లె ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలుపొందడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: శ్రావణ మాసం శనిత్రయోదశి చివరి శనివారం సందర్భంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామదూతక్షేత్రం శనీశ్వరుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. కొనకనమిట్ల రామదూతక్షేత్రం శనీశ్వరుని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. రామదూత క్షేత్రం శనీశ్వరుని ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు శనీశ్వరునికి అష్టోత్తర శత కళశాతిలాభిషేకం, అలంకరణ, శాంతి హోమాలు జరిపించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామివారికి శనివారం ప్రత్యేక శాంతి పూజలను అర్చకులు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కంభంరోడ్డులోని శ్రీ ప్రసన్నవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.


రేగడపల్లిలో భక్తుల పూజలు

దరఖాస్తు చేసుకుంటే లైసెన్సులు

మార్కాపురం: ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఎఫ్‌పీఓ లైసున్సులను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారుల కంపెనీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైసెన్సులు కావాల్సిన ప్రతినిధులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాబార్డు ఏజీఎం రవికుమార్ మాట్లాడుతూ లైసెన్సులు పొందిన వారు రైతులకు తక్కువ ధరకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఎఫర్ట్ సంస్థ ఈడీ మోహన్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తి దారులు ప్రత్యేక డ్రైవ్ ద్వారా లైసెన్స్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ జీఎం రఘురాం, మార్కాపురం ఏడీఏ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు